క్లుప్తంగా

శ్రీనివాసుని దర్శనం.. పాప హరణం



చంద్రేడులో కొలువైన శ్రీనివాసుడు

రంగంపేట: మండల పరిధిలోని చంద్రేడులో కొలువైన పద్మావతీ అలమేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని అందంగా అలంకరణ చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు.

వేంకటేశ్వరునికి పంచామృతాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

పెదపూడి: సంపర గ్రామంలో ప్రసిద్ధి చెందిన వేంకటేశుని ఆలయంలో కార్తిక మాస మొదటి శనివారం సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు స్వామి వారికి పంచామృతాభిషేకం, తులసి పూజ, అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు చేశారు. భక్తులు దీపారాధన చేసి స్వామి వారిని దర్శించుకున్నారు.

మార్మోగిన అయ్యప్ప శరణు ఘోష



గణపతి హోమంలో అయ్యప్ప స్వాములు

రంగంపేట: ఏటా కార్తిక మాసంలో గణపతి హోమం, అయ్యప్పకు లక్ష బిల్వార్చనతో సామూహిక పడిపూజ నిర్వహిస్తున్నామని మణికంఠ క్షేత్రం పీఠాధిపతి చొల్లంగి అర్జున రావు గురుస్వామి తెలిపారు. శనివారం స్థానిక మణికంఠ క్షేత్రం వద్ద తూము శ్రీను దంపతులచే గణపతి హోమాన్ని ఆలయ అర్చకుడు దేవరబొట్ల శిరిడి సాయి శర్మ నిర్వహింపజేశారు. 108 కలశాలతో కన్యకలు గ్రామంలో ఊరేగుతూ స్థానిక ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద గల మంచి నీటి చెరువులోని నీరు తీసుకువచ్చి మణికంఠ క్షేత్రం వద్ద శివునికి జలాభిషేకం చేశారు. అనంతరం సుమారు 5 వేల మంది భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక భక్తులతో పాటు ఇతర గ్రామాల అయ్యప్ప మాల ధారులు, భక్తులు పాల్గొన్నారు. అయ్యప్ప స్వామి శరణు ఘోషతో పరిసరాలు మార్మోగాయి.

అవగాహనతో విద్యుత్ ప్రమాదాలు దూరం



అవగాహన కరపత్రాలను ప్రదర్శిస్తున్న డీఈఈ శ్రీధర్ వర్మ, సిబ్బంది

రంగంపేట: విద్యుత్తు భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని రాజమహేంద్రవరం రూరల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్ వర్మ సూచించారు. స్థానిక విద్యుత్తు సబ్ స్టేషన్ వద్ద మండల విద్యుత్తు శాఖ అధికారి శిరీష ఆధ్వర్యంలో శనివారం విద్యుత్తు భద్రతా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన శ్రీధర్ వర్మ మాట్లాడుతూ.. పనికి ప్రతిఫలం జీతం అయితే భద్రతకు ప్రతిఫలం జీవితమని అన్నారు. విద్యుత్తు పనులు నిర్వహించేటప్పుడు భద్రతను విస్మరించ కూడదని సూచించారు. దీనిపై ప్రజలు, రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి నెలా 2న విద్యుత్తు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించాలన్నారు. అనంతరం విద్యుత్తు సిబ్బందితో భద్రతా ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఎల్వి ధర్మారావు, విద్యుత్తు సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక తొలగింపునకు దరఖాస్తులు

సీతానగరం: మండలంలోని జిరాయితీ పట్టా భూముల్లో ఇసుక తొలగింపునకు దరఖాస్తులు చేసుకోవచ్చని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ శనివారం తెలిపారు. జిరాయితీ పట్టా భూముల్లో వ్యవసాయోగ్యం కాకుండా, ఇసుక తొలగించాల్సిన భూములకు సంబంధించి పట్టాదారులు అవసరమైన తగిన ఉత్తర్వుల కోసం భూ రికార్డులను జత చేస్తూ తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

రాజానగరం: రాష్ట్రంలో రైతులకు అండగా తమ ప్రభుత్వం ఉందని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. జి.యర్రంపాలెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

అండాదొండ లేక...

- అంతంత మాత్రంగా దిగుబడి
- ధర కూడా తగ్గిన వైనం
- దిగాలు చెందుతున్న రైతులు



వంగలపూడిలో దొండ పాదులు

సీతానగరం: దొండ సాగు దండగలా మారింది.. రైతన్నలను కుదేలు చేస్తోంది.. నష్టాల ఊబిలోకి నెట్టేస్తోంది.. అందినకాడికి అప్పులు చేసి సాగు చేసిన రైతులకు ధరాఘాతం దిగాలు తెచ్చింది. ధర బాగుంది అనుకున్న సమయంలో దిగుబడి తగ్గింది. గత నెలలో పది కిలోల దొండ రూ.350 ఉండగా, అప్పుడు దిగుబడి లేదు. ఇప్పుడు పది కిలోలు రూ.130కు పడిపోగా పంట చేతికివచ్చింది. ఇదిలా ఉంటే దళారుల చేతుల్లో కూరగాయల రైతులు మోసపోతూనే ఉన్నారు. వారు ఆడిందే ఆటగా మారింది. సీతానగరం మండలంలో సుమారు 650 ఎకరాల్లో దొండపాదులు సాగు చేస్తున్నారు. వంగలపూడి, రామచంద్రపురం, పురుషోత్తపట్నం, సీతానగరం, చినకొండేపూడి, రఘుదేవపురం లంక, గరువు భూముల్లో ఎకరానికి రూ.50 వేల నుంచి రూ.60 వేలు శిస్తు చెల్లించి దొండ పాదులు పెట్టారు. వాతావరణం అనుకూలించడంతో పంట అనుకున్న సమయానికి చేతికి వచ్చింది. పది కిలోల దొండకాయలు రూ.350 వరకూ దేవి నవరాత్రుల సమయం వరకూ విక్రయించారు. అది క్రమేపీ తగ్గుతూ ఇప్పుడు రూ.130కు పడిపోయింది. దీంతో రైతులు ఒక్కసారిగా కుదేలయ్యారు. దొండ విత్తనాలకు, పందిరి కర్రలకు, వైర్లు, పాదుల పెంపకం పెట్టుబడి, కోత కూలీలు, ఎరువులు, పురుగుల మందులకు కలిపి ఎకరానికి రూ.2 లక్షల వరకూ ఖర్చు అవుతుంది. దొండ పాదులు రెండేళ్ల వరకూ ఉంటాయి. మొదటి ఏడాది పెట్టుబడి ఎక్కువ అవుతుంది. రెండో ఏడాది పందిళ్లు, కర్రలు వంటివి అవసరం లేనందున పెట్టుబడి తగ్గుతుంది. పాదులు పెట్టిన రెండు నెలల నుంచి దొండకాయలు కాపులోకి వస్తాయి. ఏడాదిలో ఎకరానికి 40 టన్నుల నుంచి 50 టన్నుల వరకూ దిగుబడి రావాల్సి ఉండగా కేవలం 25 టన్నుల నుంచి 35 టన్నులకు పడిపోయింది. ధర బాగున్నా దిగుబడి గణనీయంగా తగ్గింది. వాతావరణ మార్పులతో దొండ పాదుల దిగుబడి తగ్గింది. దొండకాయలు కోయడానికి కూలీలకు ఇవ్వాల్సిన సొమ్ము కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిల్వ ఉంచి అమ్మకాలు జరపడానికి వీలులేని పరిస్థితి. ప్రతి వారం కోయాల్సిన దొండ కాయలను పది రోజుల దాటిన అనంతరం కోతలు జరిపి, వాటిని అమ్మకాలు జరుపుతున్నారు. నష్టాల నుంచి తమను ఆదుకోవాలలి రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ధర లేక అంతా నష్టమే



ఎకరంన్నర పంట భూమిలో దొండపాదుల పెట్టాను. గత నెలలో ధర ఎక్కువగా ఉన్న సమయంలో దిగుబడి లేదు. ఎకరానికి పెట్టుబడిగా రూ.రెండు లక్షలకు పైగా పెట్టుబడి పెట్టాను. కిలో ధర రూ.13 మాత్రమే ఉంది. దళారులు రోజుకో ధర పెడుతున్నారు. దీంతో నష్టాలు వస్తున్నాయి. ప్రభుత్వం ఆదుకోవాలి.

– కొరవటి చింతయ్య కాపు, కౌలురైతు, వంగలపూడి

కౌలు సొమ్మూ రాదు



ఎకరం దొండపాదులు పెట్టాను. కిలో దొండ రూ.130 కు కొనుగోలు చేస్తున్నారు. దిగుబడి అంతంత మాత్రంగా ఉంది. కౌలు సొమ్ము కూడా రాని పరిస్థితి వచ్చింది. పెట్టుబడి రూ.2 లక్షలు అయ్యింది. అంతా నష్టమే. బయట వ్యాపారులు మాత్రం రోజుకో ధర పెడుతున్నారు. గత నెలలో ధర బాగుంది. ఆ సమయంలో దొండకాయలు కాపులోకి రాలేదు. కిలో దొండ కాయలు రూ.12 నుంచి రూ.14 ధరతో కొనుగోలు చేస్తున్నారు. బయట వ్యాపారులు మాత్రం కిలో దొండను రూ.40కు అమ్ముతున్నారు.

– తోరం శోభన్‌బాబు, కౌలురైతు, లంకూరు

నేడు కార్తిక వన సమారాధన

రాజానగరం: దివాన్‌చెరువులోని లక్ష్మీగణపతి వర్తక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తిక వన సమారాధన జరగనుంది. శ్రీరామపురం రోడ్డులోని ఆకుల అమ్మారావు తోటలో జరిగే ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరుకావాలని నిర్వాహకులు ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

మహిళల భద్రతపై శ్రద్ధ వహించాలి



నర్సరీ రైతులతో మాట్లాడుతున్న డీఎస్పీ భవ్యకిశోర్

కడియం: నర్సరీల్లో పనిచేసే మహిళల భద్రత పట్ల అంతా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సౌత్‌జోన్ డీఎస్పీ భవ్యకిశోర్ సూచించారు. మండలంలోని కడియపు లంకలోని సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ కార్యాలయంలో నర్సరీ రైతులతో శనివారం రాత్రి డీఎస్పీ సమావేశమయ్యారు. ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీఎస్పీ మాట్లాడుతూ పని నుంచి వచ్చి, వెళ్లే మహిళలు అందరూ కలసి రావాలన్నారు. అలాగే నర్సరీల్లో పనిచేసేందుకు వచ్చే మగవారి ప్రవర్తనపై నిఘా ఉంచాలన్నారు. చిన్న పిల్లలను నర్సరీ పనుల్లో పెట్టుకోవద్దన్నారు. నర్సరీ రైతులు, కడియం పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వే గ్రామ సభలను సద్వినియోగం చేసుకోండి



పెదపూడి గ్రామ సభలో దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్ సీతాపతిరావు

పెదపూడి: భూ సమస్యల పరిష్కారానికి గ్రామాల్లో నిర్వహిస్తున్న రీ సర్వే గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పీవీ సీతాపతి రావు అన్నారు. పెదపూడి గ్రామంలో సర్పంచి కె.కృష్ణమూర్తి అధ్యక్షతన శనివారం రీ సర్వే గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూ కొలతల్లో తేడాలు, సర్వే నంబర్లలో మార్పులు, వారసత్వ పేర్లు నమోదు, సరిహద్దు సమస్య, భూ విస్తీర్ణంలో తేడాలు మొదలగు సమస్యల పరిష్కారాన్ని రీసర్వే గ్రామ సభల్లో రైతులు పొందవచ్చన్నారు. గ్రామ సభలో సుమారు 200 దరఖాస్తులు అందాయన్నారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్ పుట్టా గంగాధర్ చౌదరి, సామాజిక ఆరోగ్యకేంద్రం అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ ఆరుమిల్లి అమ్మన్న చౌదరి, వీఆర్వోలు నాగేంద్ర, దోమాడ లక్ష్మీ సునీత, గొల్లపల్లి అంజిబాబు, కరెడ్ల రమేష్‌బాబు, సచివాలయ కార్యదర్శి ఉష, సుబ్రహ్మణ్యం, ఆలయ ఈఓ మోర్త మురళీ వీరభద్రరావు పాల్గొన్నారు.

మూతపడిన జనసేన కార్యాలయం



రాజానగరంలో మూతపడిన జనసేన పార్టీ కార్యాలయం

రాజానగరం: ఎన్నికల సమయంలో రాజానగరంలో ఎంతో హడావుడిగా ప్రారంభించిన జనసేన పార్టీ కార్యాలయం కొన్ని రోజులుగా మూతబడింది. నెలల రోజులుగా బోసిపోతుంది. దీంతో సమస్యల పరిష్కారం కోరుతూ మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే జనం మూతపడిన కార్యాలయం షట్టర్లను చూసి, ఉసూరుమంటూ వెనుతిరుగుతున్నారు. జనసేన పార్టీ కార్యాలయ భవనం అద్దె సక్రమంగా చెల్లించపోవడం, కరెంటు బిల్లులు కట్టక పోవడం వంటి పలు రకాల కారణాలను ప్రస్తావిస్తూ సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం సాగుతోంది.

నైపుణ్యాలతో ఉద్యోగావకాశాలు



మాట్లాడుతున్న ఐబీఎస్ బిజినెస్ స్కూల్ మేనేజర్ నవీన్

రాజానగరం: ప్రస్తుత పోటీ ప్రపంచంలో చదువుతో పాటు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు ఉన్న వారికే ఉద్యోగావకాశాలు పుష్కలంగా ఉంటాయని ఐబీఎస్ బిజినెస్ స్కూల్ మేనేజర్ కోరుకొండ నవీన్ అన్నారు. గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లో 'క్యాంపస్ టు కార్పొరేట్' అనే అంశంపై శనివారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రతి విద్యార్థి తమలోని నైపుణ్యాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకుంటూ, ఉద్యోగ జీవనంలో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు కృషి చేయాలన్నారు. రిజ్యూమ్ తయారీ, సంభాషణ నైపుణ్యాలు వంటి అంశాలను ఏవిధంగా మెరుగుపరుచుకోవచ్చో వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జయానందకుమార్, జీజీయూ నైపుణ్యాభివృద్ధి సంస్థ డైరెక్టర్ పీఆర్‌కే రాజు, హెచ్‌ఓడీ డాక్టర్ బీవీఆర్ నాయుడు పాల్గొన్నారు.

దేవాలయాలకు కార్తిక శోభ



కోరుకొండలో నిత్యాన్నదానానికి హాజరైన భక్తులు

మధురపూడి: కార్తిక మాసం కావడంతో దేవాలయాలకు సరికొత్త శోభ వచ్చింది. కోరుకొండలో నరసింహస్వామి దేవాలయంలో నిత్యాన్నసమారాధన జరిగింది. శనివారం రైస్‌మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు వల్లేపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సుదూర ప్రాంతాల నుంచి స్వామివారి దర్శనార్థం అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. అయ్యప్ప మాలధరించిన భక్తులూ వచ్చారు. వీరంతా అన్నసమారాధనలో పాల్గొన్నారు. బూరుగుపూడి బాబాఆలయంలో ఆలయ గురువు మామిడిపల్లి రామారావు, చైర్మన్ కంటే నాగేశవరావు, సత్యచక్ర గణపతి ఆధ్వర్యంలో 108 లీటర్లతో క్షీరాభిషేకం చేశారు. ఓం శ్రీసాయిరామ్ జపయజ్ఞాన్ని భక్తులు మొదలు పెట్టారు. నెలంతా ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ జపయజ్ఞాన్ని పఠిస్తామన్నారు. కోరుకొండ ఎస్సై శ్యామ్ సుందర్ దంపతులు బాబాకు పూజలు నిర్వహించారు. రాత్రి దీపాలంకరణతో ఆలయమంతా ఆధ్యాత్మికంగా నిలిచింది.

ట్రాక్టర్ డ్రైవర్ల మధ్య ఘర్షణ



సింగవరం అనధికార ర్యాంపులో ఇసుక తవ్వకాలు

సీతానగరం: కోరుకొండ మండలంలోని శ్రీరంగపట్నం, సీతానగరం ఇసుక ట్రాక్టర్ల డ్రైవర్ల మధ్య ఘర్షణ తలెత్తింది. శనివారం అనధికార ర్యాంపు సింగవరం కైలాసభూమి రోడ్డు నుంచి విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు జరిపి ట్రాక్టర్లపై తరలిస్తున్నారు. ప్రభుత్వం వంగలపూడి- 1, 2 ర్యాంపులు, కాటవరం ర్యాంపులు అధికారికంగా ప్రకటించింది. ఆ ర్యాంపుల నుంచి ఉచిత ఇసుక తవ్వకాలు జరపవలసి ఉండగా అనుమతి లేని సింగవరం ర్యాంపు నుంచి కైలాసభూమి రోడ్డుపై అధిక సంఖ్యలో ట్రాక్టర్లపై ఇసుక తరలిస్తున్నారు. అయితే ట్రాక్టర్లపై ఇసుక వేసే విధానంలో తమను వెనక్కి పెడుతున్నారంటూ కోరుకొండ మండలం నుంచి వచ్చిన ట్రాక్టర్ డ్రైవర్లు గొడవకు దిగారు. దీంతో ఇరు మండలాల ట్రాక్టర్ డ్రైవర్ల మధ్య ఘర్షణ తలెత్తింది. కైలాసభూమి రోడ్డును నీటితో తడిపి ట్రాక్టర్లు రాకపోకలు సాగించేలా ఇసుక ట్రాక్టర్ యజమానులు చెప్పడంతో రైతులు శాంతించారు.

సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలకు ఎంపిక

సీతానగరం: స్థానిక ప్రభుత్వ హైస్కూల్ గణిత ఉపాధ్యాయులు కన్నూరి సతీష్‌బాబు, పీడీ వి.సింహాద్రిలు రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం ఎం.వీరభద్రరావు శనివారం తెలిపారు. వెయిట్ లిఫ్టింగ్‌లో సతీష్‌బాబు, అథ్లెటిక్స్‌లో సింహాద్రిలు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 6 నుంచి 9 వరకూ విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని హెచ్‌ఎం వివరించారు. వీరిని ఎంఈఓ కె.స్వామి నాయక్, హెచ్‌ఎం వీరభద్రరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

5 నుంచి వయోజనులకు డిజిటల్ పాఠాలు



శిక్షణలో పాల్గొన్న వలంటీర్లు

రాజానగరం: సమాజంలో పెరుగుతున్న డిజిటల్ అవసరాలపై వయోజనులను కూడా చైతన్యవంతులను చేయాలనే సంకల్పంతో చేపట్టిన డీడీ, వయోజన విద్య బోధన కార్యక్రమాన్ని 5 నుంచి ప్రారంభించాలని ఐకేపీ ఏపీఎం సునీత అన్నారు. ఇందుకు సంబంధించి ఎంపిక చేసిన వాలంటీర్ టీచర్స్‌కు స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన సమావేశంలో దిశానిర్దేశం చేశారు. జిల్లాలో ఫస్ట్ ఫేజ్‌గా రాజానగరంతోపాటు రంగంపేట, బిక్కవోలు, పెరవలి, చాగల్లు, నిడదవోలు మండలాలను ఎంపిక చేసి, ఈ మండలాలకు చెందిన ఎంపీడీఓలు, ఏపీఎంలు, సీసీలకు ఇటీవల రాజానగరంలో శిక్షణ ఇచ్చిన సంగతి విదితమే. అనంతరం మండలాల వారీగా ఇంటర్ పైబడి అర్హత ఉన్న వారిని వాలంటీర్ టీచర్స్‌గా ఎంపిక చేసి, వారికి ఈ అధికారుల ద్వారా బోధన విధానాలపై అవగాహన కలిగించారు. ఎంపీడీఓ ఝాన్సీ, ఐసీడీఎస్ సీడీపీఓ టి.నాగమణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడిగా రామ గుర్రెడ్డి



ఎన్నికైన నూతన కార్యవర్గం

పెదపూడి: అనపర్తి తాలుకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) అధ్యక్షుడిగా అనపర్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామ గుర్రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనపర్తిలో శనివారం జిల్లా ఏపీజీఈఏ అధ్యక్షుడు వర్మ, కార్యదర్శి విల్సన్ ఆధ్వర్యంలో సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో అధ్యక్షుడిగా డాక్టర్ రామగుర్రెడ్డి, ఉపాధ్యక్షుడిగా రవిబాబు, కార్యదర్శిగా పిల్లి ప్రసాద్, జాయింట్ సెక్రటరీలుగా జీ.ఆనంద్, తిరుమల దేవి, ఆలీసా ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని సీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ పద్మశ్రీ, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ తరుణ్, వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు అభినందించారు.

ఘనంగా నందికేశ్వరుడి గ్రామోత్సవం



గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

బిక్కవోలు: మండల పరిధిలోని పందలపాక గ్రామంలో దాతల సహకారంతో నిర్మించిన గౌరీదేవి ఆలయంలో ఐదేళ్లకు ఓసారి జరిపే నందికేశ్వర స్వామి ఊరేగింపును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం నందికేశ్వర స్వామిని భాజా భజంత్రీలతో గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మండల పరిషత్ సమావేశం



మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రకాష్

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీడీఓ ఎం.భారతి, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. పీహెచ్‌సీ వైద్యులు ఏవీకే చైతన్య, ఎస్.రాజు మాట్లాడుతూ పాము, కుక్కకాటుకు మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. మెరుగైన వైద్య సేవల కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్నామన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని వాటిని పరిష్కరించే విధంగా చూస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రకాష్ తెలిపారు. గతంలో హౌసింగ్‌లో ఇల్లు కట్టుకున్న వారికి బిల్లులు పడే విధంగా చర్యలు చేపట్టామని హౌసింగ్ ఏఈ అన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ నాగేశ్వేణి, ఏపీఎం జిలాని, వైస్ ఎంపీపీ-2 సత్యం మదన్‌బాబు, సర్పంచుల సంఘ మండల అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, వైఎస్సార్ సీపీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు స్పీచ్ ట్రైనర్ అందజేత



ఎంఈఓ సత్యనారాయణకు స్పీచ్ ట్రైనర్ అందజేస్తున్న దాతలు

పెదపూడి: కుమార ప్రియం గ్రామంలో గల ఎంపీపీ పాఠశాలలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో జి.మామిడాడ భవిత కేంద్రంలో గల ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు స్థానిక డాక్టర్ సానా ప్రవీణ్ స్పీచ్ ట్రైనర్‌ను మండల విద్యాశాఖాధికారి-2 సీవీవీ సత్యనారాయణకు అందించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ పిల్లలకు స్పీచ్ ట్రైనర్ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఈ సౌకర్యాన్ని చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పరికరంతో పిల్లలకు మాటలు నేర్పించవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సానా నాగేశ్వరరావు, భవిత కేంద్రం ఉపాధ్యాయులు పి.జ్యోతి పాల్గొన్నారు.

శాశ్వత లోక్ అదాలత్‌లో సమస్యల పరిష్కారం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): విద్యుత్, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, వైద్య, తపాలా, టెలిఫోన్, బ్యాంకింగ్ వంటి సేవలకు సంబంధించిన సమస్యలను జిల్లా న్యాయస్థానం ఆవరణలో ఉన్న శాశ్వత లోక్ అదాలత్ (ఫర్ పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్) (ప్లాపస్)లో పరిష్కరించుకోవచ్చని ప్లాపస్ చైర్మన్ ఎ.గాయత్రిదేవి చెప్పారు. శనివారం తూర్పుగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో శాశ్వత లోక్ అదాలత్ ప్రజా ప్రయోజన సేవలపై ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించిన వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ గాయత్రిదేవి మాట్లాడుతూ పైతరహా వివాదాల్లో కోర్టు ఫీజు లేకుండా రాజీ మార్గం ద్వారా సత్వర పరిష్కారం పొందవచ్చన్నారు.

న్యాయ సేవలపై అవగాహన

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు మాట్లాడుతూ అందుబాటులో ఉన్న ఉచిత న్యాయ సేవల గురించి వివరించారు. ఎలాంటి న్యాయ సహాయం కావాలన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు తెలియజేయాలన్నారు. డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్ తగాదాలు, ప్రమాద, బ్యాంకు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, ప్రీ- లిటిగేషన్ కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని వివరించారు.

టీబీ పరీక్షలు తప్పనిసరిగా చేయాలి



పంచాయతీ కార్యదర్శులకు గాంధీజీ బ్రాంజ్ మెడల్, సర్టిఫికెట్‌ను అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో టీబీ ప్రిసమ్టటివ్ టెస్టులు తప్పని సరిగా చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శనివారం స్థానిక ఆనం కళా కేంద్రంలో టీబీ ఫోరం/సొసైటీ, టీబీ ముక్త్ గ్రామ పంచాయతీ అవార్డు ప్రదానోత్సవ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టీబీ లక్షణాలు ఉన్నవారిని ముందుగా గుర్తించి సరైన చికిత్స అందించాలని కలెక్టర్ అన్నారు. పంచాయతీ కార్యదర్శుల బాధ్యత, విధుల నిర్వహణలో వారి పాత్రపై ఇటువంటి వేదిక ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో గోల్డెన్ గాంధీ అవార్డు కోసం తమ వంతుగా కార్యదర్శులు ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలన్నారు. స్క్రీనింగ్, పరీక్షలు, నిర్ధారణ, చికిత్స ద్వారా 2025 నాటికి టిబి విముక్తి భారత్ దిశలో ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకుని వెళ్లాలని సూచించారు. టీబీతో మన దేశంలో ప్రతి మూడు నిమిషాలకు ఇద్దరు మరణిస్తున్నారని తెలిపారు. టీబీ లక్షణాలు ఉన్న వారికి మెరుగైన పోషక విలువలతో కూడిన ఆహారం అందించడం ద్వారా మాత్రమే సాధ్యం అన్నారు. అందుకోసం మరింత మంది నిక్షయమిత్రాలని గుర్తించి వారి పేర్లు నమోదు చెయ్యాల్సి ఉందన్నారు. టీబీ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి సోకే అవకాశం ఉందని, అయితే సరైన విధానంలో చికిత్సా పొందడం ద్వారా సమూలంగా తొలగించే అవకాశం ఉందని జిల్లా టీబీ, లెప్రసీ, ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ ఎన్.వసుంధర పేర్కొన్నారు. చికిత్సా విధానం, సక్రమంగా మందులు వాడడం ద్వారా మాత్రమే సాధ్యం అవుతుందని తెలిపారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి (ఇన్‌చార్జి) ఎం.నాగలత, డ్వామా పీడీ నాగమహేశ్వరరావు, ఐఎంఏ సెక్రటరీ గురుప్రసాద్, డీఈఎంఓ, ఎంఆర్‌సీఎస్ సత్యకుమార్, ప్రముఖ పల్మనాలజిస్టులు డాక్టర్ జి.రత్నాకర్, డాక్టర్ ఎ.మేరీ వసంత, డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డాక్టర్ సాయి, టీబీ ఫోరమ్ జిల్లా సభ్యులు శర్మ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి



బలభద్రపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

బిక్కవోలు: రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సూచించారు. మండల పరిధిలోని బలభద్రపురం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ధాన్యాన్ని రైతులు కోరుకున్న రైస్ మిల్లులకు తరలించేలా సరళ తరమైన విధానాలు అమలు చేస్తున్నట్టు తెలిపారు. ధాన్యం తోలిన 48 గంటల్లోనే నగదు జమ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.